# తప్పత్రోవ

—: రచన :—
మానం భుజంగరావు

"నన్ను నమ్మించాడు. ద్రోహంచేసాడు. నా జీవితాన్ని, సౌందర్యాన్ని, యవ్వనాన్ని పీల్చి పిప్పిచేసాడు రామం. ద్రోహం, రాక్షసకృత్యం, అమానుషం......

నన్ని ఎడారిలో ఒంటరిగా విడిచివేస్తాడని అనుకోలేదు. అతనిలో లీనమై పోదామని అనుకున్నాను. అతని గుండెలమీద ప్రశాంతంగా తీయని కలలనుకంటూ నిద్రపోదామనుకున్నాను. అతనితో కలసి స్వర్గమయ ఆనందాన్ని అనుభవిద్దామనుకున్నాను. కాని అతని తీయని పల్కులలో, చల్లని చూపులలో, పెదమలమీద నాట్యమాడే చిరునవ్వులలో నా జీవితాన్ని నాశనం చేసేటంత విషం మిళితమై ఉంటుందని ఊహించుకోలేకపోయాను. నరరూప రాక్షసిని నా ప్రణయ దేవతగా పూజించాను. మానం-అభిమానం-సంఘం కట్టుబాట్లను-లోకాన్ని అతనికోసం, ముగ్ధమోహన సౌందర్యశోభితుండైన ఆ ప్రేమమూర్తి చిరకాల కౌగలింతలకోసం ప్రతిఘటించాను. ఆఖరకు నా ప్రాణాల్నికూడ త్యజించడానికి సంసిద్ధమయ్యాను. అతన్ని అనుసరించాను.

సమాజం-లోకం ఇంత నీచమైందని అన్యాయం - అపచారం - మోసంతో నిండిఉందని నాల్గుగోడలమధ్య నున్నంతకాలం తెలుసుకోలేకపోయాను. నేనొక బానిసనని, నాల్గుగోడలమధ్య బంధింపబడ్డ ఖైదీనని భ్రమపడ్డాను. స్వాతంత్ర్యం అందరి హక్కనుకున్నాను. జీవితాన్ని స్వతంత్రంగా స్వతంత్ర వాయువులను పీలుస్తూ ఆనందంతో ఏ అడ్డంకులు లేకుండా గడుపుదామనుకుని చేసుకున్న భర్తను మోసంచేసి వచ్చాను. కామాంధుడు! ద్విపాద పశువు నన్ను మోసం చేస్తాడనుకోలేదు."

ఆమెను ఆవేశం-క్రోధం - దుఃఖం ఒక్కమారు అవేశించాయి. ఆమె కనుకొనలనుండి నీటిబిందువులు జలజల రాల్తున్నాయి. స్వేచ్ఛ అంటే ఏమిటో పూర్తిగా తెలుసుకోక స్వతంత్రవాయువులను పీల్చడానికి తప్పత్రోవలలో పడిన నవయుగ యువతులు మానాన్ని, అభిమానాన్ని కోల్పోయి మురికిలో జీవితాన్ని గడపవఅసి వస్తుంది. పాపం! సుగుణ విషయంలోకూడ అంతే అయింది.

మిట్టమధ్యాహ్నం. ఎండ తీవ్రంగా కాస్తోంది. సుగుణ ఒంటరిగా సముద్రపుటొడ్డున నిప్పురవ్వల్లా పాదాలకు అంటుకుంటున్న ఇసుకమీంచి నడుస్తూంది. వేడిగాడ్పులలో ఆమె కోమలమైన శరీరం కుమిలిపోతోంది. రాత్రి పదకొండు గంటలకు కడుపులో వేసుకున్న రెండణాల టిఫిను మరో గంటకే అమెకు ఆకలిని కలిగించినా ఆఅనాధ నిస్సహాయురాలు ఈకాలంలో కడుపునిండా తిండిని ఎట్లా సంపాదించుకోగలదు? ఎండ తీవ్రతతోపాటు ఆమె కడుపులో అకలిమంట కూడ తీవ్రరూపం దాల్చింది. తల జోరుగా కొట్టుకుంటూంది. ప్రతీ అంగములో ఏదో బాధను అనుభవిస్తూంది. ముందుకి ఒక్క అడుగుకూడ వేయలేనంతస్థితికి వచ్చింది. బీచి రోడ్డుమీద జారిపోతున్న మోటారుకార్ల ధ్వనిలో 'అమ్మా' అన్న ఆమె హీనస్వరం లీనమైపోయింది.

సాయంకాలం ఏడుగంటలవరకూ ఎక్కడవున్నదో తెలుసుకోలేని మగతలోవున్న సుగుణ కన్నులు తెరచేసరికి అంతా అయోమయంగా ఉంది ఆమెకు. తనీగదిలోకి ఏలా వచ్చిందా అన్న సంశయం ఆమెను కలవరపరుస్తూంది. రాత్రి రెండణాల టిఫిను — చలిలో వణుకుతూ కాళరాత్రిని గడపడం- సూర్యోదయంనుంచి ఒక అణా డబ్బులకై తహతహపడ్డం-కడుపులో ఆకలి-హృదయంలో అగ్నిమంటలు-మిట్టమధ్యాహ్నం - వేడిగాడ్పులు-కాలుతున్న బీచిలో నడవడం....

పాలమీగడలాంటి గోడలు - అద్దంలాంటి గచ్చు-స్ప్రింగ్ మంచం - మల్లెపూవులాంటి పరుపు - తలమీద ఫేను - ఎలక్ట్రిక్ లైటు - ఎదురుగుండా రకరకాలయిన పళ్ళు........ అంతా అయోమయంగా తోస్తుందామెకు. కొన్నిగంటలక్రితం తన పరిస్థితి ఇప్పటి పరిస్థితిలోని తేడా ఆమెను పిచ్చెత్తిస్తూంది. తను చూస్తున్నది నిజమేనా అన్న సంధిగ్ధం కూడ ఆమెకు కలుగుతూంది. ఆశ్చర్యంతో లేచి నలువైపులా వెర్రిగా చూసింది. తన తలవద్దనే కూర్చున్న అతన్నిచూచి సిగ్గుతో కృంగిపోయింది. తనవైపూ, తన అంగముల వైపూ కొంటెచూపులను విసరుతూన్న అతని చూపుల్లో ఏదో విషపూరితమైనభావం ఇమిడి ఉందని అనుమానపడ్డది. కాని రసపూరితమైన అతని మాటల్లోని ఆతిధ్యం ఆమె అనుమానాలను తొలిగించింది.

ఆమె క్లిష్టపరిస్థితులకు ఎంతో సానుభూతిని చూపాడతను. తన కరుణగాధ అతని హృదయాన్ని కరిగించిందని తెలుసుకున్నదామె. అతని సానుభూతితో కూడిన మాటల్లో అమృతం చిలుకుతున్నట్లుందామెకు. పురుషులందరూ తన్ను నమ్మించి ద్రోహంచేసిన రామంలాంటి నరరూప రాక్షసులు కారని దృఢపరుచుకుంది.

"ఈలోకం, సమాజం, సమాజంలోని పెద్దమనుష్యులు వట్టి భేషజం. అంతా అన్యాయం! స్త్రీ అంటే వారి దృష్టిలో ఏదో కొత్తగా అవతరించిన వ్యసనాలుతీర్చే ఆటబొమ్మ. ఆమె యవ్వనాన్నిపీల్చాలి. ఆమెను అనుభవించాలి. తర్వాత ఆమెను కులటగా ఎంచాలి. జారిణిగా చూడాలి. ఇది లోకన్యాయం. ఇటువంటిలోకంలో నివసించడంకంటే దీన్ని విడిచిపెట్టడం మేలు" అంటున్న అతనిమాటలు ఆమెను వశపర్చుకున్నాయ్. స్త్రీమీద అతనికుండే అభిమానం—భావం ఆమెను సంతోషపరిచాయి.

"మృత్యుదేవతనుండి నన్ను రక్షించారు. మీ ఋణాన్ని ఎన్ని జన్మాలకైనా తీర్చలేను-నా మానాన్ని హరించాడు. హృదయాన్ని కాల్చాడు. నన్ను మోసంచేశాడు రామం" సుగుణ వెక్కి వెక్కి ఏడుస్తూంది. అతని హృదయం వెన్నలా కరిగింది.

"నీ రామాన్ని నీ కాళ్లదగ్గరకు వచ్చేటట్లు చేస్తాను. అతన్ని నీకు సమర్పిస్తాను. నా

మాట నమ్ము. నా సోదరికన్నా ఎక్కువగా చూసుకుంటూన్న నీకు సహాయం చేయలేని అసమర్థుడను కాను.” ఆవేశపూరితమైన అతని పలుకులు సుగుణహృదయాన్ని పులకరించివైచాయి.

రాత్రి రెండుగంటలయింది. మెరుపులతో వర్షం ఉమ్మరంగా కురుస్తూంది. రోడ్డుమీద ఎలక్ట్రిక్ దీపాలు ఆరిపోయాయి. నలువైపులా గాఢాంధకారం. ప్రకృతిదాల్చిన వికృతి రూపం లోకానికి భయాన్ని కలుగజేస్తూంది. సుగుణకు నిద్దరపట్టలేదు. తన జీవితాన్ని గూర్చిన ఆలోచనలు ఆమెబుర్రలో విరామం లేకుండా పరిగెత్తి ఆమెను కలతపరుస్తున్నాయి. ఇంతలో ఆమెగదిలోకి ఎవరోవస్తూన్న పాదచప్పుడు వినబడ్డది. చట్టునలేచి నలువైపులా చూసింది. ఎవరూ లేరు. ఎలుకను తరుముతూన్న పిల్లి కనబడ్డది.

మరల పడుకుంది. ఈసారి ఆమెకు గాఢంగా నిద్దరపట్టింది. ఎవరో ఆమెను తాకినట్లయింది. వళ్లు జలదరించింది. త్రుళ్లి పడిలేచింది. గదంతా గాఢాంధకారం. ఎవరది?

......................

మాట్లాడరేం?

నేనూ....

ఎందుకొచ్చారూ?

అతనినుండి తప్పించుకుందికి రోషంతో విదిలించింది. కాని ఏంలాభం? అతని బలమైన ఇనుపచేతుల్లో ఇరుక్కుపోయింది. గట్టిగా అరవటానికి శక్తిశూన్యం. అతని దృఢమైన చేతుల్లో—విషపు నవ్వుల్లో — కామవాంఛలో నలిగిపోతూంది. పాపం అంటే భయంలేదు అతనికి. అతనికి కావలసింది ఆమె-నవయవ్వనంలో ఉన్న ఆపకుచు—ఆకర్షణీయమైన ఆమెశరీరం, అంతే. ఇదేనాన్యాయం? తనను ఆశ్రయించిన అనాథల జీవితాలను చనకలగా తరగడమేనా సంఘనియమం? హు. ఇంకెక్కడిన్యాయం ఏనాడో తెల్లారింది.

ఆమె శరీరాన్ని యవ్వనాన్ని పీల్చిపిప్పి చేసాడు. తనకు సంతృప్తి కలిగింది. ఇంకా

ఆ అభాగినీ తనకెందుకు? ఈవిశాల విశ్వంలో సుగుణస్థితికి సానుభూతి చూపేప్రాణి లేకపోయింది. ఆమె కుమిలి కుమిలి ఏడుస్తూంది. తెల్లనివన్నీపాలు నల్లని వన్నీనీళ్ళు అనేస్వభావంకలది. అందరి హృదయాలు తనలాంటివే అనుకుంది. కాని ఈ తుచ్ఛుడు ఇట్లా ఘోరం చేస్తాడనుకోలేదామె. అంతామాయ. మోసం, ప్రతివ్యక్తి వంచకుడు — కామవాంఛితుడు— మోసకాడు. సమాజం, సంఘనియమం అన్న పేరుతో ఎందరి అమాయక జీవుల ప్రాణాల్ని నలిపిందో? అబ్బ— ఈ సమాజం చీమునెత్తురు లేని కసాయి దుకాణం.

కాస్సేపటికి చెట్లమీద పక్షులు అల్లరి చేస్తూ ఎగురుతున్నాయి. ప్రపంచమంతా చీకట్లు. తన హృదయంలో చీకటి తనశరీరంపై జెర్రులు ప్రాకుతున్నట్లుంది. శరీరంపై అసహ్యం—జీవితంపై నిరాశ—గుర్రుపెట్టి నిద్రబోతూన్న లోకంపై రోత ఒక్కుమ్మడిని ఆమెలో కల్గాయి. చీకట్లను చీల్చుకుంటూ ఉన్మాదినిలా వెళ్ళిపోతూంది ఆ అభాగిని. ఎక్కడికో ???

# * ఆంధ్రం *

రచన: కొక్కొండ వాసుభాస్కరరావు

●

ఇది సుషుప్తి
గాఢనిశీథ విషాదప్రకృతి
విషాద, మనోరథ విఫలప్రసక్తి
హాహాకారాల కాసక్తి
ఇక మిగిలింది తిరస్కృతవిరక్తి.

అవు నది వాస్తవం
ఆంధ్రధంకానాద
మాకస మంటడం
తెలుగువీరులపదను
తలవారితలపుతో
గిరులగుండెలుగూడ
గడగడలాడడం
కాదన లేడెవడు.

కాని—కాలంకాళ్లనుకట్టలేం
“గతంగతః” అంతే
ప్రారబ్ధం యిది
“గతానుగతికం”లోకం.

అమరావతీనగర శిల్పాలసంపద
శిథిలాలలోనుంచి తొంగిచూస్తావుంది
నాగార్జునునికొండ శిథిలశిల్పాలలో
జీర్ణించుకొనివుంది విజ్ఞానగరిమ.

సత్యం, ఆంధ్రమహత్వం జగద్విఖ్యాతం
ప్రస్తుత మది విస్మృతం
కారణం? కాలభ్రమణం.

మందారమకరంద
మాధుర్యమును జిమ్ము
మహర్షి పోతన మావాడే.

కండబలంతో
కొండలుపిండి
గుండచేసిన గండుమగలు
రెడ్డివీరులు
మాగడ్డవారే.

అవును—
మాతండ్రి మహర్షి
మాతాత తపస్వి
నేనో సన్యాసి—

ఆంధ్రం
అభినవ శూరమయం
పరస్పర కలహాసంకులం
ప్రజ్ఞకు పూర్ణానుస్వారం
ప్రతిజ్ఞోత్తరకుమారమయం
ఎవరికి వారే నాయకులం.

బుర్రలన్నీ పెద్దవే
లోటుమాత్రం లోపలిసరుకు.

ఇది ప్రస్తుతసత్యం
ప్రాచీనమనగత్యం
ఇదే రహస్యం
ప్రాచీన ప్రాభవం
పట్టుకువ్రేళ్లాడడం.

ఇది ఆంధ్రం!
కాదనలేం అంధమయం!